# జ్ఞానం

పులిపాక శ్రీరామచంద్రమూర్తి

"ఎందుకమ్మా వాళ్ళిద్దరూ తన్నుకుంటున్నారు?" అడిగింది ఆరేళ్ళ అహల్య. అప్పటికి సినిమా ప్రారంభమై పావుగంటైంది.

"తన్నుకోవడం కాదు......" తర్వాత ఏం చెప్పాలో తెలీక ఆపేసింది జయంతి కూతురివైపు చూస్తూ.

"మరేమిటి"?

"ఏం లేదు. నోరుమూసుకో. వెధవ ప్రశ్నలూ, నువ్వూనూ" అంది జయంతి విసుగ్గా. ఆ సీను త్వరగా అయిపోతే బాగుండుననుకుందామె. అయితే కేవలం ఆ సీన్ ఒక్కటీ ఎడ్యుకేటివ్‌గా చూపించి డిస్ట్రిబ్యూటరు మొదటి వారంలోనే డబ్బులు దండుకున్నాడని జయంతికి తెలీదు.

"ఎందుకమ్మా అబ్బాయి నవ్వుతున్నాడు? అమ్మాయి తప్పించుకుంటుంది?"

జయంతి మాట్లాడలేదు. అహల్య చెయ్యెత్తి తల్లి తల తనవైపుకు తిప్పుకుంది.

"అమ్మాయి జాకెట్టు చూడు... కాళ్ళుకూడా కనిపిస్తున్నాయి"

"మాట్లాడకుండా చూడలేవా?" కసిరింది జయంతి.

"తెలీకపోతే అడగాలని నువ్వే చెప్పావు కదా, మొన్న కోకోనట్ స్పెల్లింగు తప్పు చెప్పినప్పుడు?"

"అది వేరు, ఇది వేరు"

తెరమీద చేతుల్లో చేతులు, నీళ్ళ తొట్టెలోంచి ఒక చేప బైటపడ్డం, జింక మీదికి పులిదూకడం అన్నీ అయ్యాయి. విలన్ కొడుకు హీరో చెల్లెల్ని చూసి గర్వంగా, పెద్దగా నవ్వుతుండగా, ఆమె ఏడుస్తూ వెళ్ళి మేడమీంచి దూకి చనిపోయింది.

సీన్ మారింది. శ్మశానంలో హీరో ప్రతిజ్ఞ చేశాడు. తర్వాత విలన్ కొడుకు ఒక బార్లో కూర్చునుండగా హీరో అద్దంలోంచి దూకాడు. విలన్ కొడుకునీ, అతని మిత్రుల్నీ చితక్కొట్టాడు. తుపాకులున్నా అందరూ ముష్టి యుద్ధాలే చేశారు. తర్వాత విలన్ కొడుకు దొంగచాటుగా ఒక మోటారు సైకిల్‌మీద పారిపోయాడు. హీరో సెకండు కూడా ఆలోచించకుండా సైకిల్‌మీద వెంటపడ్డాడు. అడ్డదారిలో వెళ్ళి దారి కడ్డంగా(?) సైకిల్ ఆపి నవ్వాడు. "మృత్యువు నించి ఇవాళ నిన్నెవరూ......"

"సైకిల్ ముందెళ్తుందా? మోటారు సైకిలా?" అడిగింది అహల్య.

"మోటారు సైకిలే"

"మరి సైకిలే ముందెళ్ళిందేమిటి?"

"సినిమాల్లో అలాగే చూపిస్తారు"

"నాన్నని మోటారుసైకిల్ అమ్మేసి, సైకిల్ కొనుక్కోమని చెబుదాం"

"నువ్విలా విసిగిస్తే ఇంకోసారి సినిమాకి తీసుకరాను"

"అయితే నేను నాన్నతో వెళ్తాన్లే" అంది అహల్య సింపుల్‌గా.

తెరమీద విలన్ కొడుకుని మోటారుసైకిల్‌కి కట్టి ఈడ్చుకెళ్తున్నాడు హీరో. అతని మోచేతులూ, మోకాళ్ళూ దుమ్ము కొట్టుకుపోతోంది. హీరో గారి హింస ఎక్కువకావడంతో అహల్య భయపడి కళ్ళు మూసుకుంది.

హీరో ఇంత ఘోరమైన హింస చేస్తున్నాడేమిటా అని సహృదయులైన ప్రేక్షకులు బాధపడిపోతారేమోనని, ఇంతకుముందు విలన్ కొడుకు హీరో చెల్లెల్ని రేప్ చేసిన సీను ముక్కలు ముక్కలుగా చూపించారు. అంటే అతనలా హీరో చెల్లెల్ని అమానుషంగా రేప్‌చేశాడు కాబట్టే హీరో ప్రతీకారం తీర్చుకుంటున్నాడే కాని, నిజానికి హీరో మనసు వెండి వెన్నెల, మంచుకొండేనని ఆ సినిమా దర్శకుడి సూపర్ సూక్తి.

"ఎందుకమ్మా అలా లాక్కెళుతున్నాడు?"

"వాడు తప్పు చేశాడు కదా అందుకని"

"ఏం తప్పు చేశాడు"

"అతని చెల్లెల్ని రేప్ చేశాడు కదా" అంది జయంతి. అహల్య కళ్ళుమూసి, నోరంతా తెరిచి నవ్వింది.

"ఇందాక వాళ్ళిద్దరూ తన్నుకోలేదూ, అదేనా రేప్ అంటే"

"ఆ అదే" అంది జయంతి కోపంగా, ప్రేక్షకులం దరికీ తెలిసిన రహస్యాన్ని కూతురికి తన నోటితో చెప్పాల్సివచ్చినందుకు.

"అది చేయడం తప్పా"

"చాలా తప్పు"

"మరి వీడు అతన్ని లాక్కెళ్ళడం తప్పుకాదా?"

"తప్పేం కాదు. అతవా పని చేశాడు కాబట్టే, ఇతనిలా లాక్కెళుతున్నాడు"

"మరి 'అహింస' పాఠంలో తప్పు చేసినవాళ్ళని..."

"ఈ చాక్లెట్ తింటూ సినిమా చూడు" అంది జయంతి. దీన్ని చస్తే సినిమాకి తీసుకురాకూడదనుకుంది.

హీరో పెట్టిన బాధలన్నీ భరించి విలన్ కొడుకు చనిపోయాడు. దాంతో విలన్ మండిపడ్డాడు. ఏదో ప్రతిజ్ఞ చేశాడు. అతని మొహంలో విలనీ లేదు, ముసలితనం లేదు. విలన్ అని చెప్పడానికి పెద్ద మీసాలు, గొంతు చించుకొనే డైలాగులు, ముసలివాడని చెప్పడానికి గడ్డం పెట్టారు. తెలుగు సినిమా విలన్లు ఏదో తప్పనిసరై దుర్మార్గప్పనులు చేస్తున్నట్టుంటారు.

తర్వాత విలన్ మనుషులు హీరో మీదికి వెళ్ళి ముందు అతన్ని కొట్టి, తర్వాత రివాల్వర్‌తో కాల్చారు. (రెండూ వెనకనించే) హీరోకి తలమీద, భుజంమీద మాత్రమే సుఖప్రదమైన దెబ్బలు తగిలాయి. అతనికి



బాండేజీ కూడా బహు అందంగానే కట్టారు. అతను ఒళ్ళు తెలీకుండా పడిపోతే హీరోయిన్ (విలన్ కూతురే నని చెప్పడం ఎందుకు?) బైటికి పరిగెత్తింది, డాక్టర్ దగ్గరికి కాదు...

"ఎందుకమ్మా అబ్బాయికి దెబ్బ తగిలితే దేవుడి ముందు పాట పాడుతుంది?" అడిగింది అహల్య. తెర మీద హీరోయిన్ బొట్టంతా చెరుపుకొని, పరమ భయంకరంగా గంటలుకొడుతూ, తనకి దేవుడిమీద నమ్మకం పోయిందని (హీరో న్యాయం కోసం నిలబడ్డాట్ట) బెదిరిస్తోంది.

"అతన్ని రక్షించమని దేవుణ్ణి అడుగుతోంది"

"మొన్న నాన్నకి జొరం వస్తే డాక్టరంకుల్‌ని పిలిచాం కదా!"

"పిలిస్తే?"

'అంకుల్ని పిలవకుండా నువ్వూ పాట పాడకూడదూ?'

జయంతి కూతురివైపు సీరియస్‌గా చూడబోయి పెద్దగా నవ్వింది. తల్లి నవ్వు చూసి అహల్య సీటుదిగి హుషారుగా ఆమె వళ్ళోకి ఎక్కింది.

"పాట పాడితే జ్వరం తగ్గదు"

'మరి అమ్మాయి పాట పాడుతుంది"

"సినిమాలో అలాగే చూపిస్తారు"

పాట అయిపోయింది. హీరోకి జ్వరం తగ్గిపోయింది. వాళ్ళిద్దరి ప్రేమ ఒక వానపాటతో గట్టిపడిపోయింది. సినిమా కూడా మలుపు తిరిగింది.

ఒక ముసలమ్మని హీరో రోడ్డు దాటిస్తూ 'నా మెదడు పొరలలో, నిర్దాణంగా నిక్షిప్తమైన జ్ఞాపకాల లోయల్లో ఒకమూల నీ ముడతలు తేలిన మొహం దోబూచులాడుతోంది' అంటాడు, "నిన్నెక్కడో చూశాను' అనడానికి బదులుగా.

"నేన్నీ అమ్మమ్మనే బాబూ' అంటుందావిడ. అతను ఆశ్చర్యంగా 'అమ్మమ్మా' అని గావుకేక పెడతాడు. 'నీ అరచేతిలో పుట్టుమచ్చ ఉండాలి బాబూ' అంటుందావిడ. 'ఉంది అమ్మమ్మా ఉంది' అంటాడు హీరో ఉద్విగ్నంగా.

"ఈ వేలి మీద నాకూ పుట్టుమచ్చ ఉంది" అంది అహల్య.

"అయితే ఏమిటి?"

"నేనెప్పుడైనా తప్పిపోతే...?"


"నోర్మూసుకొని సినిమా చూడు" అంది జయంతి కోపంగా.

తెరమీద అమ్మమ్మ, మనవడూ కన్నీళ్ళు కార్చారు. తర్వాత ఆవిడ 'ఇరవై యేళ్ళ క్రితం......" అని చెబుతుంది. అప్పుడు ముసలి విలన్ హీరో తండ్రిని హత్య చేశాట్ట. ఈ రహస్యాన్ని ఆమె గుండెల్లో దాచుకుందిట. దాంతో హీరో ఫైరయిపోయి విలన్‌ని చంపి తండ్రి ఆత్మకి......

అక్కడ విలన్ ముందు ఐదు సెంటీమీటర్ల బట్టలలో ఒకామె రతిక్రీడ భంగిమలతో డాన్స్ చేస్తూ ఉంటుంది.

"దీని కసలు బట్టలే లేవు" అంది అహల్య. 'యాపిల్' పుస్తకంలో మొదటిసారి బొమ్మలు చూస్తున్నట్టు ఆ డాన్సర్ వైపు విచిత్రంగా, ఆశ్చర్యంగా చూసింది అహల్య.

"మాట్లాడకుండా చూడు" అరిచింది జయంతి. అలా అరవకపోతే మళ్ళీ ఏదో ఒక ప్రశ్న అడుగుతుంది, తను జవాబు చెప్పలేక ఇబ్బందిపడాలి.



"ఈ అమ్మాయి లాగా ఎవరూ బట్టలు వేసుకోరు. నువ్వెప్పుడైనా వేసుకున్నావా?"

"ఛీ...ఛీ"

"మరి అమ్మాయి డ్రాయరు... డ్రాయరేసుకుందే విటి?"

"సినిమాలో అలాగే చూపిస్తారు. ఇదుగో ఇంకో చాక్లెట్"

పాట అయిపోగానే హీరో వచ్చాడు. తర్వాత ముష్టి యుద్ధం. ముందు విలన్ భవనంలో, తర్వాత కొండల మీద.

"ఇందాక ఇంట్లో కొట్టుకున్నారు కదా?"

"ఊఁ" అంది జయంతి.

"ఇప్పుడు కొండల దగ్గరికి ఎలా వచ్చారే?"

"సినిమాలో అలాగే చూపిస్తారు"

అహల్య ఈసారి అమాయకంగా నవ్వలేదు. జంటిల్‌గా నవ్వింది. ఆ నవ్వు చూసి జయంతి భయపడింది.

చివర్లో స్టెన్‌గన్‌తో విలన్‌ని కాల్చేశాడు హీరో. తర్వాత సంకెళ్ళు చూపిస్తూ, కులాసాగా నవ్వుతూ, చట్టం గుడ్డిదని చెబుతూ జైలుకెళ్తాడు.


కూతురి చెయ్యి పట్టుకొని బైటికొచ్చింది జయంతి. జనం పిసీ నిషాతో మెల్లిగా కదులుతున్నారు. ఇద్దరు కుర్రాళ్ళు డాన్సర్ పాడిన పాట పాడుతూ హుషారుగా నడుస్తున్నారు. .

పొలంలో, హలంతో
రెక్కల కష్టం చేసుకో
నా మడిలో విత్తు వేసి
ఫలసాయం నాతో పంచుకో

జయంతి ఆ నాలుగు ముక్కలు విని మనసులోనే 'ఛీ...ఛీ' అనుకుంది.

'ఫలసాయం స్పెల్లింగేమిటమ్మా?' అడిగింది అహల్య.

"నన్నడక్కు" అంది జయంతి కోపంగా.




తెలుగు మాటలకి స్పెల్లింగు ఉంటుందని ఆమెకి తెలీదు. తల్లి మాట్లాడకపోవడంతో అహల్య తనుకూడా "పొలంలో..." అంటూ ప్రారంభించింది.

"ఆ పాట పాడకు" కసిరింది జయంతి.

"సినిమాలో పాటనే ఇది"

"అది మంచి పాట కాదు. నువ్వసలు సినీమా పాటలు నేర్చుకోకు" అంది జయంతి. అహల్య తల్లివైపు ఆశ్చర్యంగా చూసింది. ఇంటి దగ్గర పాటపాడితే 'ఏదీ మళ్ళీ పాడు' అంటుంది. 'చూశారా మీ అమ్మాయి పాటపాడుతోంది' అంటుంది తండ్రితో. ఇప్పుడు మాత్రం సినిమా పాటలు నేర్చుకోవద్దంటుంది.

"ఈ సినిమా అసలేం బాగాలేదమ్మా" అంది అహల్య మొహం చిట్లించి.

జయంతి కూతురి వైపు చాలా ప్రేమగా చూసింది. ఆరేళ్ళ వయసులో తనకింత జ్ఞానం వుందా? లేకపోతే ఇప్పటి పిల్లలకే తెలివి ఎక్కువా?

అహల్య నడుస్తానని అంటున్నా వినకుండా తను ఎత్తుకొని ఇంటికి వెళ్ళింది జయంతి. లోపలికి వెళ్ళగానే భర్తతో చెప్పిందామె.

"చూశారా విచిత్రం! మన సినిమాలు బాగుండవని దీనికిప్పుడే తెలిసిపోయింది"

(తెలుగు సినిమాల ఘనతరమైన కీర్తి గురించి అమెరికాలోని ఆంధ్రులకు(తెలుగువారు కాదు) చెబుతామనే సదుద్దేశంతోనే ఈ కథ )

—— రచయిత.


# మంట • దురద • రక్తం కారడం
# మూల వ్యాధికి మొదటి లక్షణాలు.

## వెంటనే చికిత్సను మొదలెట్టండి.
## ఆపరేషన్ చేసే పరిస్థితిని రానియ్యకండి.

మూలవ్యాధి సాధారణంగా వచ్చే వ్యాధి. కాని అశ్రద్ధ చెయ్యడం వల్ల అది ముదిరిపోవచ్చు. అప్పుడిక అపరేషన్ చెయ్యవలసి రావచ్చు.

మూలవ్యాధికి ప్రభావంతో పనిచేసే చికిత్స, ప్రెపరేషన్-హెచ్★. దీన్ని విదేశాల్లోని ప్రముఖమైన డాక్టర్లు సిఫార్సు చేస్తారు.

ప్రెపరేషన్-హెచ్ ఔషధయుక్తమైన మలాము, అద్వితీయమైన ఫార్ములా— త్వరగా ఆ బాధ, దురదా నుంచి ఉపశమనం యిచ్చి, నిజానికిది వాపును తగ్గించి మొలలుగల కండరాలను ముడుచుకుపోయేలా చేస్తుంది. ప్రెపరేషన్-హెచ్, అక్కడ జారుడు చేసి, సుఖ విరోచనం అయ్యేలా చేస్తుంది.

15 గ్రా., 30 గ్రా. మరియు 50 గ్రా. ట్యూబుల్లో దొరుకుతుంది.




* Licensed user of TM: Geoffrey Manners & Co. Ltd.

GM-PH-84-TL